

# నాగరికత నీడల్లో..

## ఎస్. రాజేశ్వరి

**జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ**

"అమ్మా! నేనీరోజు 'స్లీపోవర్'కి పెడుతున్నాను." ఇంట్లో కొస్తూనే, పుస్తకాల బేగ్ పక్కన పడేసి, సోఫాలో కూర్చుని ఆయాసపడుతూ అంది, ఏడో క్లాసు చదువుతున్న నీరజ.

"ఏమిటీ?' కిందటి వారమేగా, మనింట్లో అంతా కలిసిపెట్టుకున్నారు. అప్పుడే ఏం తొందరొచ్చిందీ?" అంటూ, తనూ వచ్చి పక్కనే కూర్చుంది తల్లి పద్మజ. మంచినీళ్ల గ్లాసు పిల్లకందించింది.

"తొందరేముంది? ఇది లాంగ్ వీకెండ్. మన్‌డే, ట్యూజ్‌డే కూడా హాలిడేస్ వచ్చాయి. మహా అయితే రేపు సాటర్ డే. మిగతా త్రీ డేస్ బోర్‌గా. అందుకే ఈ రోజు సాయంత్రానికే, నా క్లాస్ మేట్ రీనా, ఇంట్లో ఎరేంజ్ చేసిందీ. దట్సాల్!" అంటూ భుజాలెగరేసి, చేతులు తిప్పుతూ చెప్పింది నీరజ.

"చాల్లే ఊరుకో. మీ డాడీకి చెప్తే, ఇద్దర్నీ తంతారు. మొన్న కూడా మనింట్లోనే గనుక పోన్లే అని ఊరుకున్నారు. అయినా, ఇక నుంచీ, ఈ స్లీపోవర్లు, స్విమ్మింగ్ పూల్‌లూ, పిక్నిక్ పార్టీలూ, మానెయ్యమని చెప్పారు కదా!"

"ఎందుకు మానెయ్యాలి? నా క్లాసు వాళ్లంతా, ఎక్కడికంటే అక్కడికి, ఎప్పుడంటే అప్పుడు, వెళ్లటల్లేదా?"

"వాళ్ల సంగతి వేరు..."

"ఏమిటా వేరు? అందరం ఒకే చోట కల్సి పెరుగుతున్నాం. కలిసి చదువుకుంటున్నాం. వాళ్లంతా మనింటికి మొన్న రాలేదా? నేను వెడితే ఏంటట?"

"అది కాదు నీరా! వాళ్లంతా ఇక్కడివాళ్లు. వాళ్ల అలవాట్లూ, ఆచారవ్యవహారాలూ వేరు. మనం ఇండియన్సు. మన అలవాట్లూ, ఆచారాలూ వేరు!" మరింత గట్టిగా నొక్కి చెప్పింది, టిఫిన్ ప్లేటు అందిస్తూ.

"ప్చ్! ఏమో. నాకేమీ అర్థం కావటల్లేదు. ఇన్నాళ్లూ అంతగా పట్టించుకునేవారు కాదు. ఈ మధ్య ప్రతిదానికీ 'నో... నో... నో..' అంటూ ఏదో ఒకటి కారణం చెబుతున్నారు" విరబోసిన జుట్టును ఎగరేసుకుంటూ అంది.

"అవును. ఇదివరకంటే చిన్నపిల్లవి. ఇప్పుడు నువ్వు పెద్దదానివయ్యావ్. అందుకు మనకున్న కొన్ని కట్టుబాట్లు పాటించాలి. ఇది అమెరికా, మనం అమెరికన్సు కాదు. మన ఆచారాలూ, అలవాట్లూ వేరు. మనకి భిన్నంగా ఉండే వీరి అలవాట్లు మనకి నప్పవు. అవుసరమైనంత వరకే ఆచరించాలి తప్ప, మనకి సరిపడని అలవాట్లకి వెళ్లకూడదు. మనకంటూ కొన్ని కట్టుబాట్లున్నాయి. మన పద్ధతులు మనవి. అందుకే నువ్వివాళ వెళ్లటల్లేదు. నీ ఫ్రెండు రీనాకి ఫోన్ చేసి చెప్పెయ్యి. 'ఇంకెటో వెడుతున్నాను. అనుకోకుండా గెస్టు వచ్చారు' అని ఏదో కారణం చెప్పెయ్యి. తీరా కారేసుకుని, ఇంటికొచ్చాక చెప్పడం బాగుండదు. కార్లో వాళ్ల పెద్దవాళ్లెదురుగా.. అంతే కాదు. ఇవ్వాళే కాదు, ఇంకెప్పుడూ. స్లీపోవర్లు... వాటర్ పార్కుల లాంటివి, ఇంట్లో చెప్పకుండా ఒప్పుకోకు. ఇకనుంచి అలాటివన్నీ బంద్!" గట్టిగానే కూతుర్ని హెచ్చరించి, తన పనిలో నిమగ్నమైంది పద్మజ.

తల్లి మాటలకి ఉక్రోషంతో, పొంగి పొరలిన దుఃఖం కట్టలు తెంచుకోగా, వెక్కివెక్కి ఏడుస్తూ పైన తన బెడ్ రూమ్‌లో కెళ్లిపోయింది నీరజ.

అసలు బయట తిరిగే అవకాశం చాలా తక్కువగా ఉండటం వల్ల (ముఖ్యంగా, వింటర్‌లో, 'హాట్' సమ్మర్‌లో.. 'ఎ.సి.') మహా అయితే వీకెండ్స్. అంటే, శని-ఆదివారాల్లో, అలా బయట ఏదో షాపింగ్ కాంప్లెక్స్‌లకి వెళ్లి కాసేపు తిరిగి రావడం లేదా ఏదైనా చూడవలసిన ప్రదేశాలకి వెళ్లిరావడం. మరీ వెళ్లాలనిపిస్తే సినిమాలకి దగ్గర్లో ఉంటే, అదీ పిల్లలకైతే, నచ్చిన కార్టూన్ సినిమాలు చూసి రావడం, ఇదే అమెరికాలో వుండేవారి కాలక్షేపం. లేదా చుట్టుపక్కల ఇండియన్సు వుంటే, నలుగురు కలిసి ఒక చోట చేరి, కేసెట్లు పెట్టుకుని, పార్టీలు చేసుకొని, కాస్త రిలీఫ్ పొందుతారు. ఇక పిల్లలైతే, ఒకే వయస్సు వారంతా ఒకరింట్లో చేరి స్లీపింగ్ బ్యాగ్‌లు, టూత్ బ్రష్ లు, కూడా తీసుకుని వెళ్లి, ఆ రాత్రంతా, వుండగలిగినంతవరకు మెలకువగా, ఆటలు, పాటలు, టీవీలో గేమ్స్-ఇలా కాలక్షేపం చేస్తారు. ఆ రోజు రాత్రి ఎవరింట్లో అయితే వారింట్లో, వాళ్ల పిల్లలంద రికీ, పీజాలు, డోనట్లు, బర్గర్లు, ఇలా తెప్పించి డిన్నరివ్వాలి. కూల్ డ్రింక్‌లు, ఐస్ క్రీములు సప్లై చెయ్యాలి. మర్నాడు దయం వాళ్లు ఎంత లేటుగా లేచినా లేచాక, వాళ్లు తినే బ్రేక్ ఫాస్ట్ పెట్టి పంపాలి. అదే స్లీపోవర్ అంటే. అలాగే 'హాలొ విన్' వచ్చినపుడు కూడా (బహు శా అక్టోబర చివర వస్తుందనుకుంటాను), దయ్యాల డ్రెస్సులు, రకరకాలుగా భయంకరంగా వేషాలు వేసుకుని, గుమ్మడి కాయలకి కళ్లూ ముక్కులూ పెట్టి, అందులో దీపాలు (కొవ్వొ త్తులు) వెలిగించి ఇళ్ల ముందుంచుతారు. ఇక పిల్లలందరూ, దయ్యాల్లా తయారై, అందరిళ్లకీ పెద్ద పెద్ద బ్యాగ్‌లు పుచ్చుకుని వెళ్లి, చాక్లెట్లు తెచ్చుకుంటారు. ఎవరికెక్కువ కలక్ట్ అయితే అంత గొప్ప. మరీ చిన్న పిల్లలైతే కూడా, పెద్ద వాళ్ల (తల్లీ, తండ్రీ, తాత ఇలా) అలా ఇంటింటికీ వెళ్లి దూరంగా ఉన్న ఫ్రెండ్స్ ఇళ్లకి కూడా వెళతారు. అంటే, వికృతాకారాల వేషాలు వేసు కొని, ప్రతి ఇంటిముందుకీ వెళ్లగానే, ఆ ఇంట్లో ఉండే పెద్దలు, గుప్పెళ్లతో తీసి, చాక్‌లెట్లు వారి బ్యాగ్‌లో వేయాలి. ఒక వేళ తలుపులు మూసి వున్నా, బెల్ కొట్టి మరీ అడిగి తీసుకుంటారట. ఇలాటివన్నీ పిల్లలకి మంచికాలక్షేపం. కాకపోతే మన ఇండియన్సు, కొంత వయస్సు వచ్చాక మన పిల్లల్ని కట్టుదిట్టం చేసేస్తారు. ఆ కట్టు బాట్లు నచ్చని పిల్లలు. తల్లిదండ్రుల్ని ఎదిరించడం కద్దు.

సాయంత్రం ఆరు గంటలకి, ఆఫీసు నుండి వచ్చిన వర్మకి, ఎదురుగా సోఫాలో కూర్చుని టీవీ చూస్తూనో, పక్కనే కంప్యూటర్ ముందు కూర్చుని హోం వర్క్ చేసుకుంటూనో, కని పించే నీరజ కనిపించకపోయేసరికి, "నీరజ ఏదీ?" అంటూ భార్యనుద్దేశించి అడిగాడు.

"అదిగో, బెడ్ రూమ్‌లో కూర్చుంది. మధ్యాహ్నం, మూడున్నరకి స్కూలు నుంచి వస్తూనే పేచీ. ఏముంది? ఈ మధ్య ప్రతి రోజూ ఏదో ఒకటి మొదలు పెడుతోంది. ఏమైనా అంటే కోపం, ఏడుపు. బొత్తిగా విని పించుకోకుండా తయారైంది.ఎలా చెప్పాలో ఏమిటో?" బాధగా, విసుగ్గా అంది.

"ఏం? ఎందుకు పేచీ? ఇవ్వాళ దేని కి సం?" ముఖం చిట్లించి అడిగాడు తండ్రివర్మ.

"ఏముంది? ఎక్కడో ఎవరింట్లోనే స్లీపో రట. వద్దన్నానని అలక."

"బాగుంది వరస. దీన్నిప్పట్నుంచీ కంట్రోల్ చెయ్యకపోతే ముందు ముందు మరీ కష్టం. సర్లే.. నేనేదో నచ్చచెబుతాను" అంటూ తను పైకి కూతురి దగ్గరకు వెళ్లాడు, బ్రీఫ్ కేసుతో సహా.

తండ్రిని చూడగానే ఇనుమడించిన దుఃఖ

తో "చూడు డాడీస మమ్మీ ప్రతీదీ వద్దంటుంది" అంటూ వాటేసుకుంది. అతిగారం, మహగారం... ఒక్కగా నొక్క పిల్ల మరి.

మరింత దగ్గరకు తీసుకుని, వీపు నిమురుతూ, "అవును తల్లీ. ఇంక నువ్వు పెద్దగా అవుతున్నావు కదా. పెద్ద క్లాసులకి వెడుతున్నావు కదా! మరీ చిన్నపిల్లవి కాదు గదా! అందుకని, కొన్ని కొన్ని తగ్గించుకోవాలి. ఎందుకంటే మన ఇండియన్స్ పద్ధతులు వేరు కదా. ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, అన్నట్లు మన పద్ధతులు మార్చుకోకూడదు. అందుకని మమ్మీ వద్దని చెప్పింది. మమ్మీ మాట వినాలి మరి" మందలింపుగా అన్నాడు.

"అసలు నాకు ఊహ తెల్సిందగ్గర్నుంచీ, ఎల్.కె.జి. నుంచీ ఇక్కడే చదివాను. ఇక్కడే పెరుగుతున్నాను. ఇండియా గురించి నాకేం తెలీదుగా? మరింత గారంగా అంది నీరజ.

"అందుకే ఇక నుంచి తెలుసుకుందువుగాని. మనం ఉద్యోగరీత్యా ఇక్కడికి వచ్చామే తప్ప, ఈ పద్ధతులను అనుసరించడానికి కాదు. కాకపోతే, ఇక్కడ ఉంటున్నందుకు, కొన్ని పాటించాలి, తప్పదు. అలా అని, మన అలవాట్లను వదులుకోకూడదు. నీకు తెలుగు మాట్లాడడం వరకే వచ్చు కానీ, చదవడం రాయడం వచ్చి వుంటే, మన పుస్తకాలు చదివితే, కొంత తెలిసి ఉండేది. పోన్లే. అవన్నీ కాదు గానీ, ఇక నుంచి, ఇలాంటి స్లీపోవర్లు, స్కేటింగులు, లాంటివి, ఫ్రెండ్సుతో కలిసి తిరిగేవి ఒప్పుకోకు. అంతగా రీనా వాళ్లు వస్తే, నేనే ఏదో సర్ది చెప్పి పంపించేస్తాను. సరేనా?" బుజ్జగింపుగా అన్నాడు.

"అయినా రీనా వాళ్లిల్లు ఇక్కడే డాడీ! మన వాకర్ గార్డెన్‌కి చాలా దగ్గర. అదే 'ఏస్పిన్' లోనే ఉంది వాళ్లిల్లు. వాళ్లన్నయ్యనో, డాడీనో తీసుకుని వస్తానంది."

"చూడు తల్లీ. ఏస్పిన్‌లో అయినా, ఎడిసన్‌లో అయినా, మనకింక అలాంటివి వద్దు. మెల్లమెల్లగా తగ్గించుకోవాలి. సరేనా?"

"నువ్వెప్పుడూ ఇంతే. మొన్న 'హాలోవిన్'కి కూడా ఎవ్వరింటికీ తీసుకెళ్లలేదు. వాళ్లంతా మనింటికి రాలేదా? ప్రతి దానికీ పద్ధతి అంటావ్!" బుంగమూతి పెట్టింది.

"ఇక్కడి వాళ్ల సంగతి వేరు, మన సంగతి వేరు. అయినా నువ్వు చదువు మీద ఎక్కువ కాన్‌సన్‌ట్రేట్ చెయ్యాలి. ప్రిన్స్‌పల్ ఆనర్ రోల్ రావాలి. పైచదువుల కెడుతున్నావు కదా. చదువు ఎక్కువ ముఖ్యం. ఇవన్నీ చదువు తర్వాతే!" కాస్త గట్టిగానే మందలించాడు.

"అదే నేనూ చెప్తున్నాను. వింటేగా? పెరుగుతున్నకొద్దీ చదువు కంటే, వేరే ఆలోచనలు పెరుగుతున్నాయ్. కాలేజీ చదువుకొస్తే, కారు కావాలి. క్రెడిట్ కార్డు కావాలి. ఇంకా ఇంకా బోలెడుంటాయ్. అప్పుడు కొత్త కొత్త అలవాట్లు చాలా వుంటాయ్. అయినా ఇప్పట్నుంచీ, లగూన బీచ్‌లు, స్వీట్ సిక్స్‌టీన్ ఫంక్షన్లు, ఆ టి.వి. ముందు కూర్చుని చూడటం. అంత ఘనంగానూ, ఆ ఫంక్షను తనకీ చెయ్యమనడం. (స్వీట్ సిక్స్‌టీన్ అంటే, మన పెళ్లంత ఘనంగా చేస్తారు. పదేనిమిదేళ్లు రాగానే, 'ఎయిటీన్ ఆఫ్టర్ థర్టీ డేస్' అని, 18 వచ్చాక 30 రోజుల్లో అమ్మాయిల్ని స్వేచ్ఛగా వదిలేస్తారు.) అడిగావు కదా అని 'సెల్ ఫోన్' కొనిస్తే అడ్డమైన వాళ్లకి నంబరిచ్చెయ్యడం, కంప్యూటరుముందు కూర్చుని గంటలు గంటలు. ఛాటింగ్ చెయ్యడం... ఈ మధ్య నేనన్నీ కనిపెడుతూనే ఉన్నాను. ఇంత వెర్రి వెర్రి ఆలోచనలూ, అలవాట్లూ నీకెందుకొస్తున్నాయ్?" అప్పుడే వచ్చిన తల్లి, భర్తకి కూడా తెలియాలన్నట్టు, నీరజని అదిలించింది.

ఇవన్నీ తండ్రికి తెలిస్తే తిడతాడన్న భయం తప్పు చేశానన్న బాధో తెలిసీ తెలియని నీరజ. చిన్నబుచ్చుకుని, మౌనంగా తల దించుకుంది.

'ఇంక చాల్లే' అన్నట్లు భార్యకి సౌంజ్ఞ చేసి. "లే నాన్నా. చక్కగా ఫ్రెష్‌గా స్నానం చేసి రా. మనం ముగ్గురం.. అలా అలా తిరిగి డిన్నరు చేసి వద్దాం" లాలనగా చెంపలు నిమిరి కూతుర్ని ముద్దు పెట్టుకున్నాడు.

"అల్లాగే డాడీ! నీ ఇష్టం. సారీ. కైండ్లీ ఎక్స్‌క్యూజ్ మీ" అంటూ, బాత్ రూమ్‌లోకి నిష్క్రమించింది.

తేలికపడిన మనస్సులతో భార్యాభర్తలిద్దరూ కిందకి వచ్చారు.

"దాన్ని ఎక్కువగా ఏమీ అనకు. మంచితనంగానే మందలించాలి. మొన్నీ మధ్య నా ఫ్రెండు, శ్రీను లేడూ! వాడి కూతురు, ఇలాగే. పిక్‌నిక్‌లు, పార్టీలు, డేటింగులు అని మొదలుపెడితే, తల్లి చెంపలు వాయించిందట. అంతే. ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఇంతా చేసి చదివేది టెన్త్ క్లాసు. మన పోలీసులు, చేను మేసే కంచెలు కాదు గనుక, జాగ్రత్తగా వెతికి అప్పచెప్పారు. ఈ రోజుల్లో పిల్లలు, బొత్తిగా వినటల్లేదు. పోనీ, ఇండియా అమ్మనాన్నల దగ్గరకి పంపుదామంటే, అక్కడ ఇంకా దరిద్రంగా ఉందట పరిస్థితి. అమెరికాను మించి వున్నారట కుర్రాళ్లు. ఇంకా ఇక్కడే నయం!" భార్యతో అన్నాడు వర్మ.

"నిజమే. మన వాళ్లు ఫోన్‌లో చెప్తుంటారుగా. అయినా టీవీలో చూస్తున్నాంగా. అక్కడ కాలేజీలు, చదువులు, అబ్బాయిలు, అమ్మాయిలు, వ్యవహారం ఎంత దారుణంగా ఉందో. ప్చ్! ఏమిటో... ఈ రోజుల్లో పిల్లల్ని కంట్రోల్ చెయ్యడం కష్టంగానే ఉంది. నాగరికత వెర్రి తలలు వేస్తోంది" బాధగా అంది పద్మజ.

"ఈ మధ్య చదువు మీద కంటే, ఇతరత్రా శ్రద్ధ ఎక్కువైపోతోంది. వెర్రిఫాషన్లు, పిచ్చషోకులు.. ఖరీదైన 'కోచ్ బ్యాగులు, మంచి మంచి జాకెట్లు (కోట్లు), రకరకాల మ్యాచింగ్ చెప్పులు, ఇలా మొదలుపెడుతోంది" సణుగుతూనే, తనూ తయారైంది.

"డాడీ! ఐ యామ్ రెడీ!" అంటూ, హుషారుగా కిందికి దిగింది, జుట్టు సవరించుకుంటూ నీరజ.

ఒక్కసారి కూతుర్ని పైనుంచి కిందికి చూసి, బరువుగా నిట్టూర్చాడు.

సగం ఒళ్లు పూర్తిగా బయటికే కనిపిస్తోంది. తెల్లటి తెలుపేమో, వేసుకున్న డార్క్ కలర్ డ్రెస్సుకి మరింత అందంగా కనిపిస్తోంది. స్లీవ్‌లెస్‌లోంచి పోగా మిగిలిన శరీరం మిసమిసలాడుతూ, కుర్రకారుని కవ్వించేలా, పాంటుకీ, పైన బాడీ లాంటి బెత్తెడు జాకెట్టుకీ మధ్య, నడుం. పొట్ట కింద భాగం.. ప్చ్, ఏం చేస్తాం? మాటల్ని మింగుకుని తమాయించుకున్నాడు.

అది గ్రహించిన పద్మజ "బయట ఇంత చలిగా ఉంటే ఒంటి నిండా డ్రెస్సు వేసుకోకపోతే ఎలా? ఆ పాంటు చూడు. మోకాళ్ల కింద నుంచి అంతా ఓపెన్గా. చలివెయ్యదూ?" సన్నాయిపాలిగా ఇన్‌డైరెక్టుగానే అంది.

అంత దాకా అర్థం కాని నీరజ. "పర్వాలేదు మమ్మీ. ఇంట్లోంచి కార్లోకి. కార్లోంచి హోటల్లోకి. అంతే. అలా కిందికి దిగినప్పుడే కదా! నాకేం అంత చలి అనిపించదు" ఫాషనుకి తక్కువైపోతుందన్నట్టు తన ధోరణిలో అంటూనే. చెప్పులేసుకుంది.

"డాడీ రేపు సాటర్ డే కదా! మన చుట్టుపక్కల అందరి కన్నా ముందుగా మనమే క్రిస్మస్ ట్రీ పెట్టేద్దాం. దానికి అందంగా డెకరేట్ చేద్దాం. సరేనా?" అంది ఎంతో అమాయకంగా.

"అలాగే నీరా! దానికేం? రేపే చేద్దాం" అన్నాడు వర్మ. సెక్యూరిటీ లాక్ చేసి. తాళం వేస్తూ.

"అన్నీ బాగానే వున్నాయి గానీ, తండ్రీ, కూతురు కలిసి బాగా డెకరేట్ చెయ్యొచ్చు. కాకపోతే ఆ తర్వాత జనవరిలో మన పండుగ. అదే సంక్రాంతి వస్తోంది. సంక్రాంతికి మటుకు, నేను చెప్పినట్టుగా ఇండియన్ డ్రెస్సు వేసుకుని, నగలన్నీ పెట్టుకుని. తయారవ్వాలి. అలా మన ఫ్రెండ్స్ ఇంటికీ. వీలైతే దగ్గరలో వున్న చుట్టాలింటికీ వెళ్లాలి. తెలిసిందా? అందుకు ఒప్పుకుంటేనే, నీకు నచ్చినవన్నీ చేసేది. లేకపోతే ట్రీలూ, పాంటులూ. అన్నీ కట్!" అంది పద్మజ, కూతురితో హెచ్చరికగా, తనూ కార్లో కూర్చుంటూ.

"సరే మమ్మీ! యాజ్ యూ లైక్" అంది ఉత్సాహంగా.

"చూశావా, నా కూతురంటే ఏమనుకున్నావ్? మనం చెప్పినట్టే వింటుంది. మాటంటే మాటే. అయినా అసలు, ఈ సారి సమ్మరులో సెలవులకి, ఇండియా వెడదాం. అక్కడ మనవాళ్లని, మన ఊళ్లనీ, పల్లెల అందాల్నీ, వారి స్వచ్ఛమైన ప్రేమానురాగాల్నీ చూస్తే, నీకే అర్థమౌతుంది. ఇదంతా నాగరికత మోజేతప్పు, అసలైన అందాలు, అమ్మాయిల కట్టూ,బొట్టూ, తీరుతెన్నులు చూస్తే నీకు బాగా నచ్చుతుంది. నువ్వసలు ఒక్కసారి చూసి తీరాలి. అప్పుడు నీకు, మన సంప్రదాయాలు, ఆచారాలు, పండుగలు, అన్నీ తెలుస్తాయ్."

"యస్.. డాడీ! కచ్చితంగా ఈ సారి వెళ్లి తీరాలి!" మాటల్లోనే (దిగవలసిన) హోటల్ వచ్చేసింది. కారును పార్క్ చేసి, కూతురికి రెండడుగులు వెనుకగా నడుస్తూ, "దీన్ని ఇలాగే మంచితనంతోనే ఒక దారిలో పెట్టాలి. మన నియమనిబంధనలని బోధిస్తూనే, ఇక్కడి కొన్ని పద్ధతుల్ని వదిలించాలి. కాలేజీ చదువుకి చెయ్యి దాటిపోకుండా ఉండాలంటే, ఇప్పట్నుంచే చెయ్యాలి" అని స్థిరంగా అనుకుని ముందడుగు వేశారిద్దరూ.